సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



నిలిచిన సుందరీకరణ

ఏడాది క్రితం చేపట్టిన చౌటుప్పల్‌లోని నాగులకుంట సుందరీకరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

- 9లో



అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

జిల్లాలో పలు చోట్ల కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

- 9లో

గరిష్ఠం/కనిష్ఠం
34°/16°

వాతావరణం

ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

ఇచ్చేది 8 గంటలే..!



మోటకొండూర్ మండలంలో 9వ తేదీ రాత్రి 10:30 నుంచి అర్ధరాత్రి 1:30గంటల వరకు, 10వ తేదీ రాత్రి 2గంటల నుంచి 3:30 వరకు కరెంట్ సరఫరా చేశారు. ఉదయం 10 గంటలకు రావాల్సిన కరెంట్ 12.30కి వచ్చింది. కొలనుపాకలోని 133/11కేవీ సబ్‌స్టేషన్ నుంచి సప్లై సరిపోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గత వారం రోజుల నుంచి మండలంలో 8నుంచి 9గంటలకు మించి కరెంట్ రావడం లేదు. దీంతో వరి పొలాలు ఎండిపోతున్నాయి.

అన్నదాతకు కరెంట్ కష్టాలు

- పెరిగిన విద్యుత్ వినియోగం
- వారం రోజులుగా అప్రకటిత కోతలు
- నీరందక వాడుపడుతున్న పంటలు
- వారం రోజులు ఇదే పరిస్థితి ఉంటే వరి చేలు ఎండిపోయే ప్రమాదం

సాక్షి, యాదాద్రి : అప్రకటిత విద్యుత్ కోతలు అన్నదాతను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వ్యవసాయానికి రోజూ 24 గంటలు కరెంట్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో 8 గంటలు కూడా సరఫరా కావడం లేదు. రాత్రి 5 గంటలు, ఉదయం 3 గంటలకు మించి ఇవ్వడం లేదు. అది కూడా ఎప్పుడొస్తదో ఎప్పుడు పోతదో తెలియని పరిస్థితి నెలకొంది. కరెంట్ కోతల కారణంగా నీరందక పొట్ట దశకు వచ్చిన వరి వాడుపడుతోంది. ఆరుతడి పంటల పరిస్థితి సైతం ప్రశ్నార్థకంగా మారింది.

వానాకాలంతో సమానంగా సాగు

నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో యాసంగిలోనూ రైతులు పెద్ద ఎత్తున పంటలు సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2.75 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 2.74 లక్షల ఎకరాల్లో వేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో నీరు పుష్కలంగా ఉండాలి. లేనిపక్షంలో దిగుబడిపై ప్రభావం చూపుతుంది. కీలక తరుణంలో విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పంటకు నీరందడం లేదు. ఇప్పటికే భువనగిరి, గుండాల, మోటకొండూరు మండలాల్లో పలు చోట్ల చిరు పొట్ట దశలో ఉన్న వరి పొలాలు వాడుపట్టాయి. ఇకనుంచైనా పూర్తిస్థాయిలో కరెంట్ ఇవ్వకపోతే వరితో పాటు ఆరుతడి పంటలు సైతం ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో

పంటల సాగు (ఎకరాల్లో)	గత యాసంగి	ప్రస్తుతం
	1,99,214	2,74,139

రైతులు పంటలు సాగు చేశారు. నీరు సమృద్ధిగా ఉండడం, నిరంతర విద్యుత్‌పై ఆశపడి రైతులు వానాకాలంతో సమానంగా పంటలు వేశారు. పంటలు చేతికొస్తున్న తరుణంలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. దీంతో బోర్లను నిరంతరాయం నడపాల్సి వస్తోంది. ఈ క్రమంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్ డివిజన్ పరిధిలో 1,14,000 విద్యుత్ కనెక్షన్‌లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

డిమాండ్, సరఫరా

ఈనెల 9వ తేదీన జిల్లాలోని విద్యుత్ కనెక్షన్‌లకు 422 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉండగా 230 మెగావాట్లు మాత్రమే సరఫరా అయ్యింది.



మోటకొండూరులో నెర్రెలువారిన పొలం

ఒక్కో మండలంలో ఒక్కో విధంగా..

జిల్లా అంతటా ఒకే సమయంలో కరెంట్ ఇవ్వడం ద్వారా లైన్లు ట్రిప్ అవుతుండడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సమస్యను అధిగమించేందుకు ఒక్కో మండలంలో ఒక్కో సమయం పాటిస్తున్నారు.

ఎప్పడొస్తదో తెలుస్తలేదు



గురువారం ఉదయం 9 గంటలకు వచ్చిన కరెంట్ రాత్రి 9 గంటలకు పోయింది. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు రాలేదు. గంటల తరబడి కరెంట్ పోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. త్రీఫేజ్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. అది కూడా ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదు.

–ఉప్పలయ్య, కూనూరు

పొలాలు ఎండిపోతున్నాయి



గ్రామంలో నాకున్న మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పది రోజులుగా విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో పొలం ఎండిపోతుంది. పేరుకు 24 గంటల కరెంట్ అని చెబుతున్నా ఎప్పుడు వస్తుందో పోతుందో తెలుస్తలేదు. ఉదయం పూట సరఫరా చేయడం లేదు. రాత్రి సమయంలో చాలా ఇబ్బంది పడుతున్నాం.


–బత్తిని నర్సయ్య, సుద్దాల

ఎండలు ముదిరితే కష్టమే



ఐదు ఎకరాల్లో వరి నాటు వేశాను. ఉదయం 8.30నుంచి సాయంత్రం 4.30 వరకు, రాత్రి 8.00 నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు త్రీఫేజ్ ఇస్తున్నారు. పగలు ఏదైనా సమయంలో త్రీఫేజ్ సరఫరా నిలిచిపోతే తిరిగి ఇవ్వడం లేదు. పేరుకే 24 కరెంట్. వాస్తవంగా 12, 13 గంటలకు మించి రావడం లేదు. ఎండలు ముదిరితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

–గన్నెబోయిన విజయభాస్కర్, ఇస్కిళ్ల



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామన్నపేటలో కాంగ్రెస్ ధర్నా

రామన్నపేట : వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం రామన్నపేటలోని ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దైద రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 24 గంటలు నిరంతంగార కరెంట్ ఇవ్వకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏడీఈ, ఏఈలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందడి శ్రీనివాస్‌రెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మిర్యాల మల్లేశం, నల్ల వెంకట్‌రెడ్డి, అంజి, ఎండీ కరీం, ఎండీ జానీ, మౌలాలి, క్రాంతి గుండాల సతీష్ పాల్గొన్నారు.

సాధారణ కాన్పుతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

మోత్కూరు : గర్భిణులు సాధారణ కాన్పుకు ప్రాధాన్యం ఇవ్వాలని,తద్వారా తల్లీ, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసనం చేయించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి ఆరోగ్యంతో ఉన్నప్పుడే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గర్భిణులు మంచి ఆహారపు అలవాట్లు పాటించాలని, వ్యాయామం, నడక చేయాలన్నారు. గర్భిణి దశ నుంచి ఆరు నెలల వరకు ఐరన్, కాల్షియం ట్యాబ్లెట్లు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. తద్వారా బిడ్డకు రక్త హీనత రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అలాగే అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగుల నివారణ జరిగి పోషకాహార లోప సమస్య ఏర్పడకుండా ఉంటుందన్నారు. సిజేరియన్ల విషయంలో జిల్లా రెడ్‌జోన్‌లోకి వెళ్లిందని, ఐరన్ టాబ్లెట్ల వినియోగంలో రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచిందన్నారు. చిన్నారులను ఎలా ఎత్తుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ అహ్మద్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, మండల స్పెషల్ ఆఫీసర్ యాదయ్య, సీడీపీఓ జ్యోష్న, సూపర్‌వైజర్ మంగమ్మ, హెచ్ఎం కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు విజయ, సునీత, ఏఎన్ఎం నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయాలి

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేలా బోధన చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధ్యాపకులకు సూచించారు. మోత్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ) కోర్సు విద్యార్థులు తయారు చేసిన దుస్తులు, వివిధ రకాల వస్తువులను ఇందిరాకాలనీకి చెందిన అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులు రూపొందించుకొని నైపుణ్యం, ఉపాధి అవకాశాలు పెంపొందించుకునేలా కార్యాచరణ చేయాలని అధ్యాపకులకు సూచించారు. డీటీపీ,ఎంపీహెచ్‌డబ్ల్యూ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ప్రభా జస్టిస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఐఈఓ రమణి, స్పెషల్ ఆఫీసర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యాదయ్య, తహసీల్దార్ షేక్ అహ్మద్, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



చంటి పిల్లలను ఎత్తుకునే విధానంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

కంటి పరీక్షలు చేయించుకోవాలి

కంటి వెలుగు శిబిరాల్లో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను డాక్టర్ హేమంత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వారికి సకాలంలో పరీక్షలు చేయాలని, అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు అందజేయాలని సూచించారు. కంటి వెలుగు పరీక్షలు చేయించుకున్న వారు కళ్లద్దాలు పెట్టుకున్న తర్వాత మంచిగా కనపడుతుందా లేదా తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని, కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైన వారు కళ్లద్దాలు పొందాలని ఆమె కోరారు. ఆమె వెంట మండల స్పెషల్ ఆఫీసర్ పి.యాదయ్య, తహసీల్దార్ షేక్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ విధానాలను ఎండగట్టాలి

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పీవీ శ్యాంసుందర్‌రావు తదితరులు

ఆలేరురూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలేరు మండలం కొలనుపాకలో బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్ శంకర్ అధ్యక్షతన జరిగిన ప్రజాగోస– బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్ల పాలనలో రాష్ట్రానికి కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. దళితుడిని సీఎంను చేస్తానని మాట తప్పారని ఆరోపించారు. దళితబంధును ఎన్ని కుటుంబాలకు ఇచ్చారని ప్రశ్నించారు.డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తానని కనీసం టాయిలెట్లు కూడా నిర్మించలేదని ఎద్దేవా చేశారు.పైగా కేంద్రం నిర్మిస్తున్న టాయిలెట్లను అడ్డుకోవడం శోచనీయమన్నారు. పీఎం ఫసల్ బీమాను తెలగాణలో అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్‌ది అతిపెద్ద అవినీతి కుటుంబంఅని, నియంతృత్వ పాలన సాగిస్తుందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాలన్ని అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేసిన కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. హరిశంకర్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నందకుమార్, రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ లింగస్వామి, రాఘవులు, చిరిగె శ్రీనివాస్, జిల్లా శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దూసరి రాఘవేంద్ర, జహంగీర్, మిట్టపల్లి భాస్కర్, బందెల సుభాష్, సతీష్, దావీద్, శ్రీను, సిద్దులు నాయకులు పాల్గొన్నారు.

దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

యాదగిరిగుట్ట : దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. అనారోగ్యానికి గురైన యాదగిరిగుట్ట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ పెత్తందార్ల పక్షాన పనిస్తుందన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకువచ్చి పేదలకు పంచుతానని చెప్పిన మోదీ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడే శక్తి సీఎం కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. ప్రశ్నిస్తున్న పార్టీలను, నాయకులపై కేంద్రం ఈడీతో దాడులు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో దళితబంధు, రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ శివరాత్రి ధానయ్య, పెద్దకందుకూర్ ఉప సర్పంచ్ మచ్చ లక్ష్మీనారాయణ, నాయకులు రామ్మూర్తి, శివరాత్రి నరేష్, పల్లపు వెంకటేష్, శివరాత్రి మహేష్, తాళ్ల సదానందం పాల్గొన్నారు.



శ్రీధర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మోత్కుపల్లి

న్యూస్‌రీల్

నేటి నుంచి సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

భువనగిరి : డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు శనివారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్ష జరుగుతాయన్నారు. మొత్తం 124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు కుట్టు మిషన్‌తో రావాలని సూచించారు. హాల్ టికెట్లను www.dte.telanga na.gov.in నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు.

స్పీకర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొంగిడి సునీత

ఆలేరురూరల్ : శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అసెంబ్లీ చాంబర్‌లో ఆయనను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఊంజలి సేవ



సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారి తిరువీధి, ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ, తిరువీధిలో సేవను ఊరేగించారు. ఇక ప్రధానాలయం, ముఖమండపం, ప్రాకార మండపంలో సుప్రభాతం, ఆరాధన, అర్చన, సుదర్శన హోమం, నిత్య కల్యాణం తదితర కైంకర్యాలు చేపట్టారు.

కల్తీ చేస్తే కఠిన చర్యలు



కొండమడుగులోని పాల కేంద్రంలో పాల శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

బీబీనగర్ : పాలను కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ డిసిగ్నేటెడ్ అధికారి డాక్టర్ ఎం.సుమన్‌కళ్యాణ్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి హెచ్చరించారు. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలోని పాల కేంద్రాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కొండమడుతుతో పాటు భువనగిరిలోని రెండు పాల కేంద్రాల్లో పాల శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం నాచారంలో ఉన్న ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. పాలను కల్తీ చేస్తున్నట్లు సమాచారం అందితే ప్రజలు వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. పాల ఉత్పత్తిదారులు స్వచ్ఛమైన పాలను కేంద్రాలకు అందజేయాలని కోరారు.

దళితులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



పాల్ట్రీని పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

భూదాన్‌పోచంపల్లి : దళితబంధు యూనిట్లు పొందిన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్ సూచించారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలం రాంలింగంపల్లిలో దళితబంధు యూనిట్లను పరిశీలించారు. యూనిట్లను ఏవిధంగా నిర్వహిస్తున్నారని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. దళితుల సంక్షేమం కోసం ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేస్తుందన్నారు. తాము లబ్ధిపొందుతూ మరికొందరికి ఉపాధి చూపాలని సూచించారు. కార్యక్రమంలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ కృష్ణ, సర్పంచ్ రాములునాయక్, ఉప సర్పంచ్ మండల నర్సింహ, వార్డు సభ్యులు గూడురు లలిత హరికృష్ణ, ధర్మ, మంచాల మధు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. శుభ్రత

యాదగిరిగుట్టను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ

- 'మన యాదాద్రి – మన బాధ్యత' పేరుతో కార్యక్రమాలు
- చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా అవగాహన
- బ్యాంక్ ఆఫ్ అమెరికా, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సహకారంతో ముందుకు

యాదగిరిగుట్ట : ఆధ్యాత్మిక నగరిగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్టను రాష్ట్రంలోనే అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దే చర్యలకు మున్సిపల్ యంత్రాంగం శ్రీకారం చుట్టింది. స్వచ్ఛత, శుభ్రత– అదే మన అందరి ఆరోగ్య బాధ్యత అనే నినాదంతో ముందుకెళ్తోంది. అంతేకాకుండా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ కోసం మన యాదాద్రి – మన బాధ్యత పేరుతో కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, సేకరించిన చెత్తనుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి ఆదాయం సమకూర్చుకోవాలన్నది మున్సిపాలిటీ లక్ష్యం. ఇందుకు బ్యాంక్ ఆఫ్ అమెరికా సౌజన్యంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సహకారంతో మున్సిపల్ అధికారులు, ప్రతినిధులు ముందుకెళ్తున్నారు.

వార్డులు, కాలనీలు, జనాభా ఇలా..

మున్సిపాలిటీలో 12 వార్డులు, 25కు పైగా కాలనీలు ఉన్నాయి. 23వేలకు పైగా జనాభా ఉంది. వీరితో



ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా తడి, పొడి, ప్రమాదకర చెత్తపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



మహిళలతో కలిసి చెత్త సేకరణకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధి అన్నమయ్య

పాటు యాదాద్రి క్షేత్రానికి రోజూ 10వేలకు పైగా భక్తులు వస్తుంటారు. ప్రధాన రహదారితో పాటు ఆయా కాలనీల్లో 200కు పైగా దుకాణాలు, 30కి పైగా హోటళ్లు ఉన్నాయి. దీంతో రోజూ ఐదు టన్నులకు పైగా తడి, పొడి చెత్తతో పాటు ప్రమాదకరమైన చెత్త ఉత్పత్తి అవుతుంది. సేకరించిన చెత్తను ప్రస్తుతం పట్టణ శివారులోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ చెత్తను వృథా చేయకుండా సేంద్రి ఎరువు తయారు చేయడంతో పాటు రీసైక్లింగ్ చేసి ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ లోగో

సుందరంగా, ఆహ్లాదంగా..

పట్టణంలో చెత్త లేకుండా సుందరంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆలోచన చేశారు. ఇందులో భాగంగానే స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్ సాధించడానికి బ్యాంక్ ఆఫ్ అమెరికా వారి సౌజన్యం, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. చెత్తను ఎలా సేకరించాలి, సేకరించిన చెత్తతో ఏరకమైన ఎరువులు తయారు చేయవచ్చు, వాటి నుంచి ఆర్థిక పరిపుష్టి ఎలా సాధించాలనే అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు.

పారిశుద్ధ్యం, పరిశుభ్రత, చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి ఒక్కరూ స్వచ్ఛత, శుభ్రత, మన ఆరోగ్యానికి భద్రత అనే నినాదంతో ఇంట్లో, ఇంటి బయట ఉన్న తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను రోజూ మున్సిపాలిటీ చెత్త బండిలో వేయాలి. తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారు. పట్టణం కూడా ఆహ్లాదంగా, సుందరంగా మారుతుంది. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపుతో బ్యాంక్ ఆఫ్ అమెరికా సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్.. స్వచ్ఛ్ సర్వేక్షణ్ 2023–24లో భాగంగా మన యాదాద్రి– మన బాధ్యతకు శ్రీకారం చుట్టాం. చెత్త సేకరణపై ఇంటింటికీ ఆర్‌పీలు,యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ బృందాలతో డిజిటల్ సర్వే చేయిస్తున్నాం. ప్రత్యేక వాహనాలపై ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి తడి, పొడి, ప్రమాదకమైన చెత్తపై అవగాహన కల్పిస్తున్నాం. వీటితో ఉన్న లాభాలు, నష్టాలను వివరిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల సహకారంతో ముందుకెళ్తున్నాం.

–జే.ఎస్.ఆర్ అన్నమయ్య, ఐఈసీ కన్సల్టెంట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధి

ఇంటింటికి వెళ్లి డిజిటల్ సర్వే

మున్సిపాలిటీ పరిధిలో 5,500కు పైగా నివాస గృహాలు ఉన్నాయి. ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరణ చేస్తున్నారా లేదా, ఏరకమైన వ్యర్థాలను సేకరిస్తున్నారు, చెత్త వాహనాలు ఇంటికి రోజూ వస్తున్నాయా, ఇళ్లలో ఉంటున్న వారు చెత్తవాహనంలో చెత్త వేస్తున్నారా లేదా అనే అంశాలపై ప్రత్యేక బృందాలు ఇంటింటికి వెళ్లి డిజిటల్ సర్వే చేస్తున్నాయి. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థకు చెందిన ఏడుగురు ప్రతినిధులు, ఆర్‌పీ (రిసోర్స్‌పర్సన్లు)లు 12 మందితో పాటు మున్సిపల్ అధికారులు నాలుగు రోజులుగా వార్డుకు ఒక టీంగా విడిపోయి సర్వే చేస్తున్నారు. అంతే కాకుండా ఆ ఇంటికి చెత్త సేకరణకు సంబంధించిన స్టిక్కర్‌ను అతికిస్తున్నారు. తడి, పొడి చెత్తతో పాటు ప్రమాదకరమైన చెత్తతో వచ్చే నష్టాలు, వాటిని వేరు చేస్తే వచ్చే లాభాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై వీడియో రూపకంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

క్లుప్తంగా

రహదారి దిగ్బంధనంలో పెద్దఎత్తున పాల్గొనాలి


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

చౌటుప్పల్ : ఈనెల 13న నిర్వహించనున్న హైదరాబాద్– విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి దిగ్బంధానికి పార్టీలకతీతంగా పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ శ్రేణులతో అత్యవసర భేటీ నిర్వహించారు. దిగ్బంధనం విజయానికి గ్రామాల వారీగా కమిటీలను ప్రకటించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఊరు నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల చంద్రస్వామి, బోయ లింగస్వామి, దేవేందర్, ఊదరి శ్యామ్, నర్సింహ, మహేష్, సుక్క అర్జున్, స్వామి, యాదయ్య, వెంకటేష్, లింగస్వామి, తదితరులు ఉన్నారు.

డీవీఎం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మృతి


ఎలమంద

నల్లగొండ రూరల్ : డీవీఎం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దొడ్డ ఎలమంద(90) అనారోగ్యం కారణంగా శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని చర్లపల్లిలోని డీవీఎం బీఈడీ కళాశాలలో ఉంచి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కుమారుడు దొడ్డ నాగరాజు, శాంతికుమార్ పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో నాగరాజు, శ్రీధర్, శ్రీదేవి, నారాయణరెడ్డి, బొడ్డుపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా.. దొడ్డ ఎలమంద 1979లో డీవీఎం ఎడ్యుకేషనల్ సొసైటీని, రామగిరిలో పాఠశాలను, 1980లో బీఈడీ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత విద్యను దగ్గర చేశారు.

దొంగల బీభత్సం

భువనగిరి : పట్టణ శివారులోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న పలు దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు బీభత్సం సృష్టించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కలెక్టరేట్ ఎదురుగా ఉన్న 3టీ, భోజనం షాపులకు సంబంధించి రేకులపై కప్పులు తొలగించి అందులోకి ప్రవేశించారు. అందులో ఉన్న సుమారు రూ.85 వేల నగదుతో పాటు పలు రకాల వస్తువులను అపహరించుకువెళ్లినట్లు బాధితులు తెలిపారు.


బాధ్యతల స్వీకరణ

మోత్కూరు : మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జీ.ఏ.ఆర్. ప్రభ జస్టిస్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ప్రభ జస్టిస్ మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

పుష్కరఘాట్.. డేంజర్ స్పాట్

సాగర్ శివాలయ పుష్కరఘాట్ వద్ద కానరాని రక్షణ చర్యలు

- స్నానానికి నదిలోకి దిగి వరద ఉధృతికి కొట్టుకుపోతున్న పర్యాటకులు
- గడిచిన నాలుగేళ్లలో 37మంది మృతి



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ వద్ద కృష్ణానదిలో వరద ఉధృతికి తట్టుకోలేక నీటమునిగి పర్యాటకులు మృత్యువాత పడుతున్న సంఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. నదీ తీర ప్రాంతాల్లో ఎక్కడా ప్రమాద హెచ్చరికల బోర్డుల ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో సందర్శకులు ప్రమాదాలకు గురవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 2022 ఆగస్టు 12న సాగర్‌కు విహారయాత్రకు వచ్చి తిరుగుప్రయాణంలో అక్కంపల్లి జలాశయంలో ఈత కొట్టడానికి దిగి ముగ్గురు నీటమునిగి మరణించారు. ఈ సంఘటన మరవకముందే గురువారం నాగార్జునసాగర్‌లోని శివాలయం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతికి కొట్టుకపోయి ముగ్గురు మృతిచెందారు. నదీతీర ప్రాంతంలో ఫెన్సింగ్ ఉండి, హెచ్చరిక బోర్డులు ఉంటే వారు నీటిలోకి దిగే సాహసం చేసి ఉండే వారు కాదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో సంబంధిత ప్రాజెక్టు, రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ, పర్యాటక అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

పుష్కరఘాట్ వద్ద జరిగిన ప్రమాదాల్లో మృతుల సంఖ్య

సంవత్సరం	మరణాలు
2019	10
2020	8
2021	8
2022	7
2023	4 (ఫిబ్రవరి 10 వరకు)

గడిచిన నాలుగేళ్లలో..

2019 నుంచి 2023 ఫిబ్రవరి 10వ తేదీ వరకు సాగర్ జలాశయం, కృష్ణానదిలో పడిన ఘటనలో 37మంది మృతిచెందారు. సాగర్ వద్ద నీటిలో పడి దిగువ ప్రాంతాలకు కొట్టుకుపోయినవారే కాకుండా కేవలం నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలే చాలా ఉన్నాయి. దయ్యాలగండి ప్రాంతం పెద్దవూర పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలకో సంఘటన జరుగుతూనే ఉంటుంది.

సుమారు 10కిలోమీటర్ల నదీతీరం..

జలాశయతీరం, నదీతీరం సుమారుగా 10కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రాజెక్టు ఎగువన దయ్యాలగండి పుష్కరఘాట్, డౌన్ పార్కు పుష్కరఘాట్ (లాంచీస్టేషన్)లు ఉన్నాయి. డ్యాం దిగువన శివాలయం ఘాట్‌తోపాటు చింతలపాలెం రోడ్డులోని సురికి ఆంజనేయ పుష్కరఘాట్‌లు ఉన్నాయి. గతంలో సాగర్‌డ్యాం దిగువన నీరు పారుతూ ఉండేది. టెయిల్‌పాండ్ డ్యాం నిర్మాణం పూర్తయిన తర్వాత ఎప్పుడు సాగర్‌డ్యాంను ఆనుకోని నీరు నిలబడి ఉంటుంది. కృష్ణానదికి వరదలు వచ్చి సాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తిన సమయంలో ఆ దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. జలాశయతీరంతో పాటు కృష్ణాతీరంలోని నీటిలోకి దిగుతారు. అంతేకాకుండా మత్స్యకారుల పుట్టీల్లో ఎక్కి జలాశయంలో తిరుగుతుంటారు. వరద ఉధృతికి పుట్టీ బోర్లా పడితే ప్రాణాలు గాలిలో కలిసే అవకాశం ఉంది.

అతి ప్రమాదకరమైన ప్రాంతం

సాగర్‌డ్యాం దిగువన గల శివాళయం పుష్కరఘాట్ అతిప్రమాదకరమైనది. ఇక్కడ స్నానాలకు దిగి చాలామంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఎగువన విద్యుదుత్పాదన కేంద్రం ఉండటంతో 8యూనిట్ల ద్వారా విద్యుదుత్పాదనతో నీటిని విడుదల చేస్తారు. సైరన్ మోగించిన తర్వాతే నీటిని విడుదల చేసినప్పటికీ ఆ సైరన్ ఒక్కోసారి నీటి సవ్వడికి పర్యాటకులకు వినపడకపోవచ్చు. నిముషాల్లోనే వరద నీటి ఉధృతి పెరగడం, సందర్శకులు తేరుకోక ముందే వరద సుడులు తిరుగుతూ రావడంతో నీటిలో కొట్టుకుపోయే అవకాశం ఉంది.


పుట్టీల్లో విహరిస్తున్న పర్యాటకులు (ఫైల్)

ముగిసిన అంత్యక్రియలు

కృష్ణానదిలో నీటమునిగి మృతిచెందిన ముగ్గురి అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. గురువారం రాత్రి మృతదేహాలు లభ్యం కాగా స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున రెండు గంటలకు పోస్టుమార్టం నిర్వహించారు. కేశవపంతుల వెంకటేశ్వర శర్మ కుమారుడు వాచస్పతి మృతదేహం, శర్మ బావమరిది హరికీర్తి నాగరాజు మృతదేహాలను హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు తరలించారు. ఉప్పలచంద్రకాంత్ మృతదేహాన్ని పైలాన్‌కాలనీలోని వారి ఇంటికి తరలించారు. శుక్రవారం వాచస్పతి, నాగరాజుల అంత్యక్రియలు బోడుప్పల్‌లో జరిగాయి. చంద్రకాంత్ అంత్యక్రియలు పైలాన్‌కాలనీలోని శ్మశానవాటికలో నిర్వహించారు. నాగరాజు కుమారుడు హరికీర్తి హర్షిత్ ఉపనయనం శుక్రవారం జరగాల్సి ఉండగా తండ్రి మరణంతో నిలిచిపోయింది.

సామూహిక ఉపనయన మహోత్సవం


ఉపనయనం అందజేస్తున్న ఎమ్మెల్సీ సురభిదేవి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సత్ర భవన్‌లో బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే శుక్రవారం సామూహిక ఉపనయన మహోత్సవం నిర్వహించారు. తుని శ్రీసచ్చిదానంద తపోవన శ్రీమఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి మహాస్వామిజీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గతంలో బ్రాహ్మణ కుటుంబాల్లో 9ఏళ్లకే ఉపనయనాలు చేసే వారని, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఆలస్యంగా ఉపనయనాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవి ప్రసాదరావు మాట్లాడుతూ బ్రాహ్మణులు ఆర్థిక స్తోమత లేని కారణంగా ఉపనయనం చేసుకోలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు, అర్చకులు తదితరులున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


మాట్లాడుతున్న సీఐటీయూ నేత భూపాల్

నల్లగొండ రూరల్ : కార్మికుల వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని దీపకుంటలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాద చర్యలతో కార్మికవర్గంలో చీలికలు తెచ్చి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4కోడ్‌లుగా విభజించి బడా పారిశ్రామిక వేత్తలకు కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతన జీఓను సవరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 17 వరకు పారిశ్రామిక రంగంలో ఉన్న అన్ని కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించి 18, 19వ తేదీల్లో సమీక్ష నిర్వహించి ప్రణాళికలు నిర్వహిస్తామన్నారు. మార్చి 1న కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఒక్కరోజు దీక్ష చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బికార్ మల్లేష్, ప్రమీల, సలీం, సైదులు, నారబోయిన శ్రీనివాస్, దండెంపల్లి సత్తయ్యగౌడ్, యాదయ్య, లింగస్వామి, గౌతమ్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ


వసతి గృహంలో స్టోర్ రూంను పరిశీలిస్తున్న జైపాల్‌రెడ్డి

రామన్నపేట : రామన్నపేట బాలుర, బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాలను శుక్రవారం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం.జైపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు నమోదును, రికార్డులను, స్టోర్‌రూం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయనవెంట వసతిగృహ అధికారులు రాజాలుబాయి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల పట్టివేత


పోలీసులకు పట్టుబడిన వాహనాలు

చౌటుప్పల్ : ఎలాంటి అనుమతులు లేకుండా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన అత్తాపూర్, షాద్‌నగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల నుంచి సేకరించిన చికెన్ వర్థాలను 4వాహనాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లాలోని పెద్దపాడు మండల కేంద్రానికి తరలిస్తున్నారు. వీటిని ఆ ప్రాంతంలోని చెరువుల్లో చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న నాలుగు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత వాహనాల డ్రైవర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కారు బోల్తా... ఒకరు మృతి

- 8 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- వివాహానికి వెళ్లి వస్తుండగా బుజిలాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఘటన


ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

మోత్కూరు : వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామం 132/33 విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన దొండ లింగయ్య ఆయన భార్య నీలమ్మ, చిన్న కూతురు, అల్లుడు నాగం అరుణ, నాగం ప్రకాష్, వీరి కూతుళ్లు ప్రీతి, శ్రవణిలతో పాటు లింగయ్య పెద్ద కూతురు పిల్లలు ఇందుశ్రీ, స్మిత, లింగయ్య వియ్యంకుడు నాగం బలరాంలతో కలిసి కారులో రామన్నపేటలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. బుజిలాపురం సబ్‌స్టేషన్ వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న వర్రెలో పడిపోగా డ్రైవింగ్ చేస్తున్న అతడి చిన్న అల్లుడు నాగం ప్రకాష్ (35) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నీలమ్మ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఈమె పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. నలుగురు చిన్నారులకు స్థానిక శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి క్లినిక్‌లో చికిత్స అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వి.జానకిరాం రెడ్డి సిబ్బందితో వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన చిన్నారులను పోలీస్ వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీపీ తనిఖీ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ

బీబీనగర్ : బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలను ఎస్‌ఐను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం శ్రీ లింగబసవేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన త్వరలో జరగబోయే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు జాతరకు వస్తున్నందున అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కల్యాణ మహోత్సవం అగ్నిగుండాల సమయంలో అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణానికి మద్యం దరిచేరకుండా జాగ్రత్త పడాలన్నారు. పార్కింగ్ తదితర స్థలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి, భువనగిరి రూరల్ సీఐ వెంకటయ్య, బీబీనగర్ ఎస్సై సైదులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

బ్రిక్స్ కంపెనీపై కేసు

నకిరేకల్ : ఇటుక బట్టీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పని చేయిస్తుండడంతో బ్రిక్స్ కంపెనీపై నకిరేకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ బైపాస్‌లోని సాయిప్రియ హోటల్ సమీపంలో ఉన్న వీజేఎం బ్రిక్స్ కంపెనీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 10 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి రోజు వారి కూలి డబ్బులు ఇవ్వకుండా రోజు 16 గంటల నుంచి 18 గంటలు పనులు చేయించుకుంటున్నారు. సమాచారం మేరకు నకిరేకల్ తహసీల్దార్ ప్రసాద్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ రంగారెడ్డి శుక్రవారం సదరు వీజేఎం బ్రిక్స్ కంపెనీ వద్ద విచారణ చేశారు. విచారణలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 10 కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పనిచేయించుకుంటున్నట్లు తేలడంతో సదరు కంపెనీ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. సదరు కార్మికులకు వేతనాలు ఇప్పించి వారి రాష్ట్రానికి పంపించినట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

అప్పులు చేసి గొప్పలు చెబుతున్న పాలకవర్గం


నిరసన ప్రదర్శన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు

భువనగిరిటౌన్ : మున్సిపల్ పాలకవర్గం అప్పులు చేసి గొప్పలు చెబుతుందని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి టీయూఎఫ్‌ఐడీసీ నిధులు తీసుకురావడం పట్ల నిరసన తెలుపుతూ కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో స్థానిక బాబు జగ్జీవన్‌రాం చౌరస్తాలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భువనగిరి పట్టణ అభివృద్ధి చేయడం కోసం హెచ్ఎండీఏ, ఏసీడీఎఫ్ నిధులు తెవాలని గాని టీయూఎఫ్‌ఐడీసీ నిధులు తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. తాజా మంజూరు చేసిన నిధులను తిరిగి ప్రభుత్వానికి మున్సిపల్ నుంచి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కైరంకొండ వెంకటేశం, ఈరపాక నర్సింహా, నాయకులు సలావుద్దీన్, మాదాసు గోవర్ధన్, పిట్టల బాలరాజు, పడిగెల ప్రదీప్, వడిచర్ల కృష్ణ, జిట్ట మల్లారెడ్డి, రాము, కృష్ణ, కాకునూరి మహేందర్ ఉన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆలేరురూరల్ : రైలు ఢీకొన్న ఘటనలో శుక్రవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎండీ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం .. జనగాం పట్టణానికి చెందిన ఎండీ అబ్దుల్‌కదీర్ (60) ఉదయం 8:30 గంటల సమయంలో ఆలేరుకు వచ్చాడు. కిమీ 265బై34 వద్ద డౌన్‌లైన్ పట్టాల సమీపం నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనుకగా వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో అతడి తల వెనుక భాగం పూర్తిగా చిట్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

ఆలేరురూరల్ : గాయాలతో పడి ఉన్న వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆలేరులోని రెడ్డిగూడెం శివారులో రైల్వే వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో పడి ఉండడంతో రైల్వే పోలీసులు గుర్తించి ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. రైలులో భిక్షాటన చేస్తూ రైలు నుంచి జారిపడి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నామని రైల్వేపోలీసులు తెలిపారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

గుండాల: క్రీ డలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సుద్దాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహద పడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలను అభినందిస్తూ రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడ ఉపేందర్, ఎంపీటీసీ పాయిలి కవిత, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ఖలీల్, వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దార సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్ బండారు శ్రీను, రైతు మండల కోఆర్డినేటర్ గడ్డమీది పాండరి, తోటకూరి భిక్షం, మహోదయ్, వేణుగోపాల్‌రెడ్డి, క్రాంతికుమార్, మహేష్, రమేష్, శ్యాంసుందర్‌రెడ్డి, రాజు, నవీన్, మధు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

ఎయిమ్స్ వైద్య విద్యార్థుల క్షేత్ర పర్యటన


బొమ్మలరామారంలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఎయిమ్స్ వైద్య విద్యార్థులు

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను బీబీనగర్ ఎయిమ్స్ వైద్య విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్య, ఫిజికల్ యాక్టివిటీస్, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోని మెనూ, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత విధానాలు, ప్రథమ చికిత్స, నీటి, అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రిక్ షాక్, ప్రాణ హాని, అంటు వ్యాధుల నివారణ గురించి పాఠశాల విద్యార్థులకు బోధించే విధానాలను స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ స్టాలిన్ బాబు వివరించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఉపేంద్ర, డాక్టర్ శివరాం, రవి నాయక్, పర్యవేక్షకులు క్రిష్ణామూర్తి, భాస్కర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుతో పోషకాహార భద్రత

- కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్


మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

గరిడేపల్లి : పప్పు దినుసులను ప్రోత్సహించడం ద్వారా పోషకాహార భద్రత సాధించవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలో పప్పు ధాన్యాల సాగు విస్తరణకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పప్పు దినుసుల్లో 25శాతం వరకు మాంస కృత్తులు ఉంటాయని, వీటితో పాటు పొటాషియం, పాస్ఫరస్, ఐరన్, మెగ్నీషియం, జింక్, ఫోలేట్, థయామిన్, నియాసిన్‌లు ఉంటాయని పేర్కొన్నారు. తినే ఆహారంలో పప్పు దినుసులు చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ పెరగకుండా ఉండడంతోపాటు, గుండె జబ్బులు రాకుండా ఉంటాయని తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద కేవీకే ద్వారా క్లస్టర్ స్థాయిలో పప్పు దినుసులైన కంది, పెసర, మినుము పంటలపై ఎంపిక చేసిన రైతుల క్షేత్ర స్థాయిలో సామూహిక ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకు కావాల్సిన విత్తనాలు, కీలక ఉత్పత్తులను రైతులకు అందజేసి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో లయోలా కళాశాల వ్యవసాయ విద్యార్థినులు మహేశ్వరి, సౌమ్య, ప్రవళిక, శరణ్య, శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, నరేష్, మాధురి, రైతులు పాల్గొన్నారు.